నేటి ప్రజావాణి రద్దు

వికారాబాద్ జూన్ 1 : తెలంగాణ ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణిని వాయిదా వేశామని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2న కలెక్టరేట్‌లో ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వచ్చే వారం నుంచి ప్రజావాణి యథావిధిగా జరుగుతుందని తెలిపారు. ఫిర్యాదుదారులు గమనించాలని తెలిపారు.

అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లిన కారు

చేవెళ్ల టౌన్, జూన్ 1 : యూటర్న్ చేస్తున్న కారును మరో కారు ఢీకొనడంతో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కల ఉన్న కాల్వలోకి దూసుకెళ్లిన ఘటన చేవెళ్లలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కందవాడ గ్రామానికి చెందిన వ్యక్తి కారులో చేవెళ్లలోని స్ఫూర్తి రెస్టారెంట్ సమీపంలో యూటర్న్ చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ వైపు నుంచి వికారాబాద్ వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపు తప్పి ఆ కారును ఢీకొని రోడ్డు పక్కన ఉన్న కాల్వలో పడిపోయింది. కారులో ఒక్కరే ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. గమనించిన చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు ఘటనా స్థలానికి వెళ్లి కారులో ఉన్న వ్యక్తిని బయటకు తీశారు.

ఉత్తరపీఠాధిపతిగా దత్తేశ్వరానంద భారతి

ఆర్కేపురం, జూన్ 1: కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతులుగా దత్తేశ్వరానంద భారతి స్వామివారికి తమిళనాడు కుర్తాళంలోని శ్రీ సిద్ధేశ్వరి పీఠంలో పట్టాభిషేకం జరగనుందని పీఠం తెలంగాణ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దత్తేశ్వరానంద భారతి పూర్వాశ్రమంలో ప్రముఖ వైద్యుడు, కాదంబరి అరవిందగా ఆయన ఉత్తర భారతదేశంలో విస్తృత వైద్య సేవలందించారని వెల్లడించారు. తన వైద్య వృత్తిని వదులుకొని ప్రస్తుతం దత్తేశ్వరానంద భారతిగా ఆధ్యాత్మిక సాధన మార్గంలోకి వచ్చారని శ్రీనివాస్ తెలిపారు. పీఠ పురోహితులు మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో జూన్ 2 నుండి 6 వరకు జరిగే కార్యక్రమాలలో ప్రతిరోజూ ఉదయం పీఠ దేవతలకు విశేష అభిషేకం,అర్చనలు, పూజలు, సాయంత్రం జగద్గురువుల అమృత భాషణం జూన్ 6 శుక్రవారం ఉదయం పట్టాభిషేకం మహోత్సవం సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవ సేవ జరుగుతుందని తెలిపారు.భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

కొండాలక్ష్మణ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

ఆర్కేపురం, జూన్ 1: దివంగత శ్రీ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 25 అడుగుల కాంస్య విగ్రహాన్ని కొత్తపేటలో ప్రతిష్ఠించేందుకు అనుమతి నిమిత్తం ఆదివారం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ వైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో పద్మశాలి సంఘం ప్రతినిధులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పున్న గణేశ్ నేత, వైస్ చైర్మన్ కౌకుంట్ల రవితేజ, గుర్రం శ్రావణ్, పడాల రవీందర్, జిల్లా సూర్యకాంత్, తలాటి రమేష్, కోశాధికారి జిల్లా జగన్నాథం, రాపోలు సుధాకర్, నారని రవీందర్, చేరిపల్లి ప్రభాకర్, దోర్నాల చంద్రమౌళి, చిటుపోలు శ్రీనివాస్, మాకం గోపాల్ పాల్గొన్నారు.

వినియోగదారుల ఆరోగ్య రక్షణే లక్ష్యం

విజయ తెలంగాణ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి

సికింద్రాబాద్, జూన్ 1: తెలంగాణ విజయ డెయిరీ అధికారులు, ఉద్యోగులు.. పాడి రైతుల శ్రేయస్సు, వినియోగదారుల ఆరోగ్య సంరక్షణకై కృషి చేయాలని విజయ తెలంగాణ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం విజయ డెయిరీలో 25వ అంతర్జాతీయ పాల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అంతకుముందు డెయిరీ ఎండీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి అంతర్జాతీయ సహకార సంవత్సరం సందర్భంగా సెల్ఫీ స్టాండ్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ద్వారా తయారీ చేసిన డీటీఎం పెరుగు, శుభోదయం చిన్న నెయ్యి ప్యాకెట్స్‌ను మార్కెట్‌లోకి వారు విడుదల చేశారు. అనంతరం ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో విద్యార్థులకు విజయ పాల ఉత్పత్తులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి గృహం నిర్వాహకులు మార్గం రాజేశ్‌ను అమిత్ రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో జీఎంలు.. మల్లయ్య, కవిత, మల్లికార్జున్, మధుసూదన్‌తో పాటు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త

ఆరుగాలం శ్రమకు ఫలితం దక్కాలంటే రైతులు నకిలీ విత్తనాలపై జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి. అధీకృత డీలర్ వద్దనే కొనుగోలు చేయాలి. తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువులను మాత్రమే కొనాలి. చేతితో కుట్టినట్లయితే దానిపై సీసంతో సీల్ ఉందో లేదో చూసుకోవాలి. బస్తాపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తిదారుని వివరాలు ఉండాలి. విత్తనాలు, ఎరువుల బస్తాలను తూకం వేయించి తీసుకోవాలి. చిరిగినా, రంధ్రాలు ఉన్న బస్తాలను తీసుకోరాదు. ఈ విషయంలో అనుమానం వస్తే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలి.

వర్షాకాలం పంటల సాగు కోసం దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతన్న

- ఆధికృత డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని వ్యవసాయ నిపుణుల సూచన
- నకిలీవి అంటగట్టేందుకు యత్నిస్తున్న ఫర్టిలైజర్ దుకాణదారులు
- కొరవడిన విజిలెన్స్, వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ

ఇబ్రహీంపట్నం, జూన్ 1 : యాసంగి సీజన్ ప్రారంభమవుతున్నది. రైతులు విత్తనాలు వేయడానికి దుక్కులు దున్నుతున్నారు. ఈ సీజన్‌లో వేసే పంటలపై రైతాంగం దృష్టి సారిస్తున్నది. వ్యవసాయ శాఖ ద్వారా రాయితీ విత్తనాలు వస్తున్నప్పటికీ కొంతమంది రైతులు ప్రైవేటు దుకాణాల్లో విత్తనాలు కొంటున్నారు. తక్కువ ధరతో ఎక్కువ దిగుబడి వస్తుందని దుకాణ నిర్వాహకులు నమ్మించి విత్తనాలను అంటగడుతున్నారు. దీంతో చాలా చోట్ల నకిలీ విత్తనాల బారిన పడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే రావడం.. తొలకరి జల్లులు కురియడంతో రైతులు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. పొలాల్లో విత్తనాలు విత్తడానికి సిద్ధం చేసుకోవడంతో పాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన పర్టిలైజర్ దుకాణదారులు, దళారులు రైతులకు నకిలీ విత్తనాలను విక్రయించి మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సమయంలోనే రైతులు అప్రమత్తంగా ఉండి విత్తనాల ఎంపికలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. నకిలీ విత్తనాలు సాగు చేస్తే పెట్టుబడి పోవడంతో పాటు దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. అధీకృత డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. ఈ సీజన్ సమయంలో టాస్క్ ఫోర్స్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైతులు మోసపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు నకిలీ విత్తనాలు ఎలా గుర్తించాలనే అంశాలపై అవగాహన కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

తూతూమంత్రంగా తనిఖీలు..

వర్షాకాలం పంటల సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అన్నదాతలు పంటల సాగుకోసం దుక్కులు సిద్ధం చేసుకుంటున్నారు. మరోసారి వర్షం కురిసిన వెంటనే విత్తనాలు విత్తడానికి సిద్ధంగా ఉన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు పర్టిలైజర్ దుకాణాలు, దళారుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఇదే అదునుగా భావించిన పలువురు దళారులు రైతులకు నాసిరకం విత్తనాలను అంటగడుతున్నారు. దీనిపై విస్తృత తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవల్సిన విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని జిల్లాలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు

- రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో ప్రభుత్వం అనుమతి పొందిన డీలర్ వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- సంబంధిత డీలర్ నుంచి తప్పనిసరిగా రశీదు తీసుకోవాలి.
- విత్తనాల ప్యాకెట్‌పై కంపెనీ పేరు, సీల్, తయారు చేసిన తేదీ, గడువు ముగిసే తేదీ, తేమశాతం తప్పనిసరిగా చూసుకోవాలి.
- పొలంలో విత్తనాలు వేసిన అనంతరం డీలర్ ఇచ్చిన రశీదు, విత్తనాల ప్యాకెట్‌కు సంబంధించిన కవర్లను పంటలు పూర్తయ్యేవరకు జాగ్రత్తగా దాచుకోవాలి.
- నకిలీ విత్తనాలు డీలర్ నుంచి కొనుగోలు చేస్తే చట్టం ప్రకారం పంటలు నష్టపోయిన రైతులు సంబంధిత కంపెనీ నుంచి పరిహారం పొందే అవకాశం ఉంటుంది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

వర్షాకాలం పంటల సాగు ప్రారంభమైన నేపథ్యంలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పర్టిలైజర్ దుకాణదారులకు అవగాహన కల్పించాం. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేయాలని చూస్తూ ఊరుకోం.

- సుజాత, ఏడీఏ, వ్యవసాయశాఖ ఇబ్రహీంపట్నం

బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం వరంగల్ నగరంలోని వేయి స్తంభాల ఆలయం, భద్రకాళి ఆలయం, ములుగు జిల్లాలోని రామప్ప రుద్రేశ్వరాలయం, మేడారంలోని సమ్మక్క సారక్క అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. **- వికారాబాద్, జూన్ 1**

రేపు జేఎన్టీయూహెచ్ స్నాతకోత్సవం

వేడుకల వివరాలను వెల్లడిస్తున్న వీసీ కిషన్ కుమార్‌రెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 1: జవహర్‌లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) 13వ స్నాతకోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించనున్నట్లు వర్సిటీ వీసీ టీ కిషన్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రెక్టార్ విజయ్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లుతో కలిసి వీసీ మాట్లాడారు. స్నాతకోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్స్‌లర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నారని తెలిపారు. ఈ వేడుకలలో ఏఐసీటీఈ చైర్మన్ టీజీ సీతారాంకు గౌరవ డాక్టరేట్‌ను అందించనున్నట్లు ప్రకటించారు. యూనివర్సిటీ ఏ-ప్లస్ గ్రేడ్ న్యాక్ గుర్తింపుతో పాటు ఎన్ఐఆర్ఎఫ్ 2024 ర్యాంకింగ్‌లో 88 వ ర్యాంకు సాధించిందన్నారు. యూనివర్సిటీ స్నాతకోత్సవ వేడుకలలో 92,118 విద్యార్థులకు డిగ్రీ పట్టాలను అంచడంతో పాటు ఉత్తమ ప్రతిభను కనబరిచిన 74 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన

కొండాపూర్, జూన్ 1: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన నృత్యకారుల భరతనాట్యం, కూచిపూడి నృత్య రీతులు సందర్శకులను అలరించాయి. కాలిఫోర్నియా నుంచి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి తాస్య ముద్దన తన ప్రదర్శనతో ఆకట్టుకోగా.. ప్రముఖ కూచిపూడి నాట్య గురువు నిర్మల్ విశ్వేశ్వర్ రావు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించింది. పలు అంశాలపై నృత్యకారిణిలు నిహారిక, గాయత్రీ, అక్షిత, మనోజ్ఞ, హాసిని, ఇషిక, సహస్ర, నిత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సాగుకు సన్నద్ధత.. సిద్ధమైన దుక్కులు

కేశంపేట, జూన్ 1 : ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో విత్తనాలు విత్తేందుకు రైతన్నలు దుక్కులను సిద్ధం చేసుకున్నారు. కేశంపేట మండల వ్యాప్తంగా రైతులు పంటలను సాగు చేసేందుకు ఇప్పటికే సిద్ధంగా ఉన్న భూముల్లో విత్తనాలు విత్తేందుకు తొలకరి చినుకులకోసం ఎదురు చూస్తున్నారు. జూన్ మొదటివారంలో విత్తనాలు విత్తితే పంట దిగుబడి అధికంగా వస్తుందని, ఇక కోతల సమయంలో పంటపై వర్షం పడే ఆస్కారం తక్కువగా ఉంటుందనేది రైతుల ప్రగాఢ విశ్వాసం. పత్తి, మొక్కజొన్న, జొన్న, కందులు, రాగులు తదితర పంటలకు సంబంధించిన విత్తనాలు ఇప్పటికే ఆయా ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేయాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

కేశంపేట శివారులో విత్తనాలు నాటేందుకు సిద్ధమైన దుక్కి

ఆస్పత్రుల్లో మౌలిక వసతులు కల్పించాలి

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

సిటీ బ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ): ఇటీవల జహీరాబాద్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో అక్కడి వైద్యులను సస్పెండ్ చేయడంపై తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం స్పందించింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్ రాథోడ్ ఆదివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. మౌలిక వసతుల లోపాలను పరిష్కరించడం ద్వారానే నాణ్యమైన వైద్యాన్ని అందించగలమని తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 1:30 గంటలకు విద్యుత్ అంతరాయం ఏర్పడగా, మరోవైపు ఆకాశం మేఘావృతం కావడం కారణంగా వెలుతురు తక్కువగా ఉండటంతో వైద్యులు మొబైల్ ఫ్లాష్‌లైట్లు, టార్చ్‌లతో వైద్య సేవలు కొనసాగించారని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం కాదని వారు పేర్కొన్నారు. ప్రతి సంఘటనలో పూర్తిస్థాయిలో విచారణ లేకుండానే డాక్టర్లను నిందించడం ప్రతిఒక్కరికి అలవాటుగా మారిపోయిందని ఆవేదన వ్యకం చేశారు. తీవ్రమైన ఒత్తిడిలోనూ, ప్రతికూల పరిస్థితుల్లోనూ నిస్వార్థంగా సేవలందిస్తున్న వైద్యులను లక్ష్యంగా చేసుకోవడం కారణంగా వారి మానసిక స్థితి దెబ్బతీటుందని వెల్లడించారు. జనరేటర్లు, అత్యవసర వెలుతురు వంటివి అందుబాటులో ఉంచటం ఆరోగ్య శాఖ బాధ్యత అని, ఈ వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తెలుసుకునేందుకు నిరంతర తనిఖీలు అవసరమన్నారు. సాధారణ ప్రక్రియ ప్రకారం.. సంబంధిత విభాగాధిపతి డాక్టర్ల ప్రవర్తనపై ప్రాథమిక నివేదికను సమర్పిస్తారనీ, ఇప్పటివరకు ఒక విజిలెన్స్ అధికారి ఆధ్వర్యంలో ఉండే విజిలెన్స్ సెల్ ఈ తరహా విచారణలను నిష్పక్షపాతంగా పర్యవేక్షించేది. అయితే, టీవీవీపీ కమిషనర్ ఈ కీలక పోస్టులను భర్తీ చేయడంలో విఫలం అయ్యారని గుర్తు చేశారు. ఈ తరహా వ్యవస్థాత్మక వైఫల్యాల సందర్భాల్లో విచారణలు పూర్తిగా స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా ఉండాలని వారు పేర్కొన్నారు.

తుపాకీ కాదు.. చర్చలతోనే పరిష్కారం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ముషీరాబాద్, జూన్ 1: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శాంతి చర్చల కమిటీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. శాంతి, చర్చల మార్గం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. తమ పార్టీ అధినేత కేసీఆర్ వరంగల్ మహాసభలో కగార్ రాజ్యాంగ వ్యతిరేక మారణకాండను వెంటనే ఆపివేయాలని, కేంద్ర ప్రభుత్వం.. ప్రజాస్వామ్య, మానవత్వ స్ఫూర్తిని గౌరవిస్తూ శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేసినట్లు గుర్తుచేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధ మార్గాల్లో చర్చల వాతావరణాన్ని కల్పించాలన్నారు. తుపాకీ కాదు, చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యం ప్రస్తావించారు.

ఆపరేషన్‌కగార్‌ను నిలిపివేయాలి

కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ పాటించి మావోయిస్టులతో చర్చలు జరపాలని వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. దండకారణ్యంలో ఆదివాసీలను దెబ్బతీసి అటవీ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడానికి చేస్తున్న కుట్రలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. కామ్రేడ్ నంబాల కేశవరావు స్మృతిలో.. 'పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక- సాయుధ పోరాటం – శాంతి చర్చలు' అనే అంశంపై ఆదివారం నిర్వహించిన సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్ పాల్గొని మాట్లాడారు. విప్లవోద్యమ నేతలే లక్ష్యంగా సాగుతున్న కగార్ ఆపరేషన్, హత్యాకాండను ప్రజాస్వామికవాదులు ఖండించాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని అడ్డుకట్టవేసి కేంద్ర ప్రభుత్వం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరపాలని నేతలు విజ్ఞప్తి చేశారు.అత్రం భుజంగరావు, ప్రొఫెసర్ జి లక్ష్మణ్, రవి, అభినవ్, ఎహతామామ్, వేణుగోపాల్, గోపీనాథ్, పాణి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లోనే పట్టణ వైద్యం

- యూపీహెచ్‌సీ భవనాలకు అద్దె చెల్లించని సర్కార్
- ఏడాది కాలంగా ఒక్కపైసా విడుదల చేయని వైనం
- ఖాళీ చేయాలని భవన యజమానుల ఒత్తిళ్లు

అద్దె భవనంలో కొనసాగుతున్న జూబ్లీహిల్స్ అర్బన్ ఫ్యామిలీ హెల్త్ సెంటర్

సిటీబ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ): జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో ఓ అద్దె భవనంలో ఉన్న ప్రభుత్వ పట్టణ ప్రాథమిక కేంద్రం (యూపీహెచ్‌సీ) 13 నెలలుగా అద్దె చెల్లించలేదన్న కారణంగా విద్యుత్ సరఫరా కట్ చేయడంతో పాటు ఖాళీ చేయాలంటూ యజమాని ఒత్తిడి చేయడం మొదలు పెట్టాడు. దాంతో అక్కడి సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి సిబ్బంది.. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ సమస్య పరిష్కారం కోసం తిరుగుతున్నారు. ఈ సమస్య కేవలం జూబ్లీహిల్స్ డివిజన్‌లో మాత్రమే లేదు. హైదరాబాద్ జిల్లాలోని మెజార్టీ ప్రాంతాల్లో అద్దె భవనాల్లో ఉంటున్న ప్రతి యూపీహెచ్‌సీలో ఇదే సమస్య వెంటాడుతోంది. సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే వైద్య సేవలందిస్తున్న యూపీహెచ్‌సీలకు ప్రభుత్వం సకాలంలో అద్దె చెల్లించని కారణంగా.. భవనాల యజమానులు తాళాలు వేస్తున్న దాఖలాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక నెల కాదు రెండు నెలలు కాదు ఏకంగా పన్నెండు నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఒనర్లు ఇబ్బందులు పెట్టడం మూలంగా వైద్యసేవలందించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఏడాది మొత్తం అద్దె ఒకేసారి చెల్లించినా, కాంగ్రెస్ సర్కార్ మాత్రం అద్దెలు చెల్లించకుండా చోద్యం చూస్తోంది.

ఏడాదిగా పెండింగ్‌లోనే...

పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉంచేందుకు కేసీఆర్ సర్కార్ వైద్య రంగానికి పెద్దపీట వేసి బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలల్లో మెరుగైన సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. సొంతభవనాలు లేనివాటికి సకాలంలో అద్దె చెల్లించి వైద్య సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా పర్యవేక్షించింది. హైదరాబాద్ జిల్లాలో సుమారు 85 యూపీహెచ్‌సీలు ఉండగా వాటిలో పలు ప్రాంతాల్లోని యూపీహెచ్‌సీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిలో కొన్నింటికి అద్దెలు చెల్లించగా సుమారు 10 యూపీహెచ్‌సీలకు గత ఏడాదికాలంగా అద్దెలు చెల్లించడంలేదు. వాటిలో ఒక్కో యూపీహెచ్‌సీకి సుమారు రూ.4లక్షల అద్దె చెల్లించాల్సి ఉంది. అయితే వాటిని చెల్లించకపోడం మూలంగా భవనాల యజమానులు అక్కడ పనిచేసే సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారు. చివరికి చేసేదేమి లేక తాళాలు వేయడం..విద్యుత్ కట్ చేయడంవంటి చర్యలకు పూనుకుంటున్నారు. దీనివల్ల రోగులకు వైద్యసేవలందక ఆస్పత్రి సిబ్బంది నానా యాతన పడుతున్నారు.

ఖజానా ఖాళీ అయ్యిందా...?

వైద్య రంగానికి 2025 బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యతనిచ్చామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అద్దెలు చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. అసలు నిధులు విడుదల చేశారా? లేదా అనే అనుమానాలు సైతం ఉత్పన్నం అవుతున్నాయి. యూపీహెచ్‌సీలకు కూడా అద్దెలు చెల్లించలేని ప్రభుత్వ తీరుపై సామాన్యులు సైతంవిమర్శలు చేస్తున్నారు. అద్దె చెల్లించి వాటికి త్వరగా అద్దె చెల్లించాలని వైద్యారోగ్య అధికారులను కోరుతున్నారు.

ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

ఖైరతాబాద్, జూన్ 1: రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని శ్రీచండి ముదిరాజ్ మత్స్యకార సంఘం అధ్యక్షురాలు కోట్ల పుష్పలత ముదిరాజ్ కోరారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి నుంచి గన్‌పార్క్ వరకు పాదయాత్ర నిర్వహించామని, మే 26న ప్రారంభమైన పాదయాత్ర మే 30న ముగిసిందన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు పండుగ సాయన్న జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలన్నారు. రంగారెడ్డి జిల్లా ఫారూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో 150 సంవత్సరాల పురాతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉందని, అందులో దివంగత మాజీ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణ రావు చదువుకున్నారని, అక్కడ పోలీసు స్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలున్నా నేటికీ గ్రామంగానే ఉందన్నారు. ఆ గ్రామాన్ని మండల కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ముదిరాజ్‌లకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో కోట్ల కృష్ణయ్య ముదిరాజ్, శివముదిరాజ్, ఆర్‌కే సాయన్న, ప్రొఫెసర్ మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, మాధవి, మాటూరి భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించాలి

బన్సీలాల్ పేట్, జూన్ 1: జనాభా దామాషా ప్రకారం అధిక సంఖ్యలో ఉన్న ముదిరాజ్ సామాజిక వర్గానికి రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు రాజకీయపరంగా అన్యాయం చేస్తున్నాయని ముదిరాజ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షుడు దొడ్ల సదానంద అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముదిరాజ్ మహాసభ జాతీయ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఏపీ ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ఏపీ ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు కొర్ర వెంకటనారాయణ రావు ముదిరాజ్ మాట్లాడుతూ.. ఏపీలో 16.5 లక్షల జనాభా కలిగిన ముదిరాజులకు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా పోయిందని అన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముదిరాజులకు గత ఎన్నికల్లో కనీసం ఒక ఎమ్మెల్యే, ఎంపీ సీటు గాని, నామినేటెడ్ పదవి గానీ ఇవ్వలేదని అన్నారు. ముదిరాజులను బీసీ గ్